

ప్రజల చేతిలో అస్త్రం సీ-విజిల్
ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఫొటో, వీడియో, ఆడియో ఏదైనా రికార్డు చేసి సీ-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.
- 8లో



నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
గ్రామ పంచాయతీల్లోని డంపింగ్ యార్డుల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.
- 9లో

గరిష్టం / కనిష్టం
43° / 27°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది
ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

మొదటి రోజు ముగ్గురు

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల .. మొదలైన నామినేషన్ల పర్వం

- భువనగిరిలో ముగ్గురు అభ్యర్థులు.. నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు
- ప్రజావాణి పార్టీ నుంచి ఒకరు, ఇద్దరు ఇండిపెండెంట్లు
- సిద్ధమవుతున్న ప్రధాన పార్టీలు


ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రజావాణి పార్టీ అభ్యర్థి వెంకటేశ్వర్లు

సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వానికి తెరలేసింది. గురువారం ఉదయం రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. మొదటి రోజు భువనగిరి స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఇందులో ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్లు, ఇండిపెండెంట్లు బేతి నరేందర్, మర్రి స్వామి ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే నామినేషన్లు స్వీకరించారు. ఆర్‌ఓ కార్యాలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తును డీసీపీ రాజేశ్ చంద్ర పర్యవేక్షించారు.

నేటినుంచి ప్రధాన పార్టీలు

- సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ శుక్రవారం (నేడు) నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితర ముఖ్య నేతలు హాజరుకానున్నారు. నామినేషన్ అనంతరం సాయిబాబా ఆలయం నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా ఏఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహిస్తారు. అక్కడ జరిగే బహిరంగ సభలో నేతలు ప్రసంగించనున్నారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ 22వ తేదీన పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేయనున్నారు.
- బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ 23న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు మరికొందరు ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్ వేయనున్నారు.
- కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి 23 న లేదా 24వ తేదీన ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి నామినేషన్ వేస్తారు.అంతకు ముందుగానే ఒక సెట్ నామినేషన్ దాఖలు చేస్తారు.

21న సీఎం రేవంత్‌రెడ్డి రాక

కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 21న భువనగిరి పట్టణంలో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు.

భువనగిరికి నాలుగోసారి ఎన్నికలు

2008లో ఏర్పడిన భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి ప్రస్తుతం నాలుగోసారి ఎన్నికలు జరగబోతున్నాయి. 2009లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి అప్పటి మహాకూటమి అభ్యర్థి దివంగత నోముల నర్సింహయ్యపై గెలుపొందారు. 2014లో రాజగోపాల్‌రెడ్డి మరోమారు బరిలోకి దిగి అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌పై ఓటమిపాలయ్యారు. 2019లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పోటీ చేసి సిట్టింగ్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌పై విజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలతో పాటు సీపీఎం కూడా బరిలోకి దిగుతుంది. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉంది. అలాగే 2014, 2019లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన బూర నర్సయ్యగౌడ్ ప్రస్తుతం బీజేపీ నుంచి బరిలో నిలిచారు. ఇక సీపీఎం సైతం ఏ పార్టీతో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేస్తుండడంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

నల్లగొండలో ఆరు సెట్లు..


బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న నాయకులు

నల్లగొండ లోక్‌సభ స్థానానికి నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున ప్రతిపాదకుడు మాదగోని శ్రీనివాసగౌడ్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందనకు సమర్పించారు. ఆయన వెంట బండారు ప్రసాద్, నాయకులు ఉన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ స్వతంత్ర అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరఫున రచ్చ సుభద్రారెడ్డి ఒక సెట్, ప్రజావాణి పార్టీ తరఫున లింగిడి వెంకటేశ్వర్లు రెండు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలు సమర్పించారు.

వడగాలులు, ఉక్కపోత


నిత్యం రద్దీగా ఉండే భువనగిరిలోని ప్రధాన రహదారి గురువారం 11 గంటలకు ఇలా..

- ఠారెత్తిస్తున్న ఎండలు
- మోత్కూరులో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు
- జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించిన వాతావరణ శాఖ



భువనగిరిటౌన్ : భానుడు ఠారెత్తిస్తున్నాడు. గురువారం మోత్కూరులో 43.4, గుండాల మండల కేంద్రంలో 43.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా ప్రాంతాల్లోనూ ఎండ తీవ్రత కొనసాగింది. దీంతో యాదాద్రి జిల్లాను ఆరెంజ్ జోన్‌గా వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఎండవేడిమికి వడగాడ్పు తోడవడంతో జనం అల్లాడిపోతున్నారు. ఇళ్లలో ఫ్యాన్ల కింద కూర్చున్నా వేడి గాలి వస్తుండడంతోపాటు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో రెండు, మూడు రోజులు వడగాలులు వీస్తాయని, అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎండ తీవ్రత కారణంగా ఉదయం 10 గంటల నుంచే రహదారులపై జన సంచారం తగ్గుతుంది. అత్యవసరం అయితే తప్పా.. బయటకు రావడం లేదు. ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు చలివేంద్రాలు, శీతలపానీయాల సెంటర్లను ఆశ్రయిస్తుండడంతో రద్దీ నెలకొంది.

గురువారం ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

మండలం	ఉష్ణోగ్రత	మండలం	ఉష్ణోగ్రత
		ఆలేరు	42.7
		ఆత్మకూరు(ఎం)	42.5
		బొమ్మలరామారం	42.3
మోత్కూరు	43.4	రాజాపేట	42.1
గుండాల	43.1	భువనగిరి	41.7
వలిగొండ	42.9	బీబీనగర్	41.6
చౌటుప్పల్	42.8	అడ్డగూడూరు	41.6
నారాయణపురం	42.8	పోచంపల్లి	41.4
యాదగిరిగుట్ట	42.7	మోటకొండూరు	40.9

న్యూస్‌రీల్

పాలిసెట్ దరఖాస్తుకు ఈనెల 22 చివరి గడువు

యాదగిరిగుట్ట : పాలిసెట్‌కు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తుందని, ఈ నెల 22వ చివరి తేదీ అని యాదగిరిగుట్ట మండలం యాదగిరిపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ షఫియాజ్ అక్తర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు రూ.250, ఇతర కేటగిరీల విద్యార్థులు రూ.500 ఫీజు చెల్లించి www.polycet.sbtet.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 24లోగా రూ.100, 26వ తేదీ వరకు రూ.300 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 24వ తేదీన పాలిసెట్ ఉంటుందన్నారు. యాదగిరిపల్లి పాలిటెక్నిక్ కళాశాలలో ఎల్రక్టానిక్స్, ఎలక్ట్రికల్ 60, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 60 సీట్లు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు


ప్రధానాలయంలో గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన గావించారు. ఇక ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

భువనగిరి గురుకులంలో నిలిచిన పరీక్షలు

భువనగిరి క్రైం : భువనగిరిలోని గురుకుల పాఠశాలలో వార్షిక పరీక్షలు నిలిచిపోయాయి. కలుషిత ఆహారం తినడంతో వసతిగృహంలోని 28 విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 6వ తరగతికి చెందిన ప్రశాంత్ అనే విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో భయాందోళనకు గురై విద్యార్థులంతా తమ ఇళ్లకు వెళ్లిపోవడంతో పరీక్షలను నిలిపివేస్తూ విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తిరిగి పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటించనున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాము తెలిపారు. కాగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్ ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలి

భువనగిరి క్రైం: ఆన్‌లైన్ ఆఫర్ల పేరిట మోసాలు పెరిగిపోతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సూచించారు. భువనగిరి మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కొత్తపల్లి సాయికుమార్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రాంకు మొబైల్ తక్కువ ధరకు వస్తుందని ఆఫర్‌తో లింకు రాగా దాన్ని ఓపెన్ చేసి రూ.25 వేలకు పైగా మోసపోయాడని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు చాలా చోటు చేసుకుంటున్నాయని, తెలియని లింకులను, ఎస్‌ఎంఎస్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు.

ఉదయ సముద్రానికి నీటి నిలిపివేత

పెద్దఅడిశర్లపల్లి : ఏఎమ్మార్పీ నుంచి నల్లగొండలోని ఉదయ సముద్రానికి నీటి విడుదలను గురువారం అధికారులు నిలిపివేశారు. ఈ నెల 2 నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాల్వ ద్వారా 1100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. నాగార్జునసాగర్ నీటిమట్టం కనిష్ట స్థాయికి పడిపోవడంతో నీటిని నిలిపివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సాగర్ వెనుక జలాల నుంచి 800 క్యూసెక్కుల నీటిని లింక్ కెనాల్ ద్వారా ఏకేబీఆర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి మెయిన్ కెనాల్ ద్వారా హైదరాబాద్ జంట నగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 45 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ సత్యనారాయణ తెలిపారు.

ఖర్చు పక్కాగా నమోదు చేయాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్‌కుమార్ రంజన్, సాయన్ దేబర్మ


కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

సాక్షి,యాదాద్రి : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చు వివరాలు పక్కాగా నమోదు చేయాలని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రాకేష్‌కుమార్ రంజన్, సాయన్ దేబర్మ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యయ విభాగం బృందాలతో వారు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగదు, మద్యం, బహుమతులపై నిఘా పెంచాలన్నారు. అభ్యర్థుల బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయాలని, అనుమానిత లావాదేవీలు, లక్ష రూపాయలు దాటిన లావాదేవీలను పరిశీలించాలని సూచించారు. నగదు డిపాజిట్, విత్‌డ్రాలను బ్యాంకు అధికారులు పరిశీలిస్తుండాలని కోరారు. సీ-విజిల్ యాప్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను వివరించిన కలెక్టర్

ఎన్నికల ఏర్పాట్లను ఆర్‌ఓ, కలెక్టర్ హనుమంతు కే.జెండగే వ్యవయ పరిశీలకులకు వివరించారు. ఎస్‌ఎస్‌టీ, వీవీటీ అకౌంటింగ్ టీములు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. బృందాలకు వివిధ స్థాయిల్లో శిక్షణ కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. భువనగిరి స్థానంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఇప్పటి వరకు 123 కేసులు నమోదు కాగా 104 కేసులు క్లియర్ అయ్యాయని, 19 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. సుమారు రూ.2.17 కోట్లు సీజ్ చేయగా గ్రీవెన్స్ కమిటీ నిబంధనల ప్రకారం రూ.1.84 కోట్ల వరకు రిలీజ్ చేసినట్లు చెప్పారు. రూ.5.12కోట్లు విలువ చేసే ఆభరణాలు, బహుమతులు, మద్యం, డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా నామినేషన్ల సందర్భంగా ఏర్పాటు చేసిన బందోబస్తు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ హాల్ వద్ద ఏర్పాటు చేయనున్న బందోబస్తు చర్యలను వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బెన్ షాలోమ్, గంగాధర్, జనగాం ఏసీపీ కార్తీక్, ఆర్డీఓ అమరేందర్, జిల్లా వ్యయ నోడల్ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, పోలీస్, సీజీఎస్‌టీ అధికారులు, అకౌంటింగ్, వీవీటీ, ఎస్‌ఎస్‌టీ టీంలు, అసిస్టెంట్ వ్యయ పరిశీలకులు, లీడ్ బ్యాంకు అధికారులు, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

భూదానోద్యమం.. ప్రపంచానికే స్ఫూర్తి


ఆచార్య వినోబాభావే విగ్రహానికి పూలమాల వేస్తున్న గున్నా రాజేందర్‌రెడ్డి తదితరులు

- గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : భూదానోద్యమం ప్రపంచానికే స్ఫూర్తి అని, ఎంతోమంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. 73వ భూదానోద్యమ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం భూదాన్‌పోచంపల్లిలో ఘనంగా నిర్వహించారు. భూదానోద్యమపిత ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో లక్షా 20వేల ఎకరాల భూదాన భూమి ఉందన్నారు. నిరుపేదలకు 15వేల ఇళ్లు, కాలనీలు ఏర్పాటు చేశామని తెలిపారు. బీబీనగర్ నిమ్స్‌కు 165 ఎకరాలు, నేషనల్ సెక్యూరిటీ, పోలీసు అకాడమీకి, అక్టోపస్, సీఆర్‌పీఎఫ్‌కు 2 వేల ఎకరాలు, కళాశాలలకు వందలాది ఎకరాల భూదాన భూమి ఇచ్చామని గుర్తు చేశారు. కొత్తగూడెం నుంచి పోచంపల్లి వరకు రూ.6 కోట్లతో డబుల్ రోడ్డు వేశామని, రూ.50లక్షలతో వినోబాభావే మందిరాన్ని పునర్నించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 11న ఆచార్య వినోబాభావే జయంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డి భూదాన్‌పోచంపల్లికి ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. పోచంపల్లికి చేనేత క్లస్టర్, డిగ్రీ కళాశాల, బస్‌డిపో, సబర్బన్ బస్సులు తదితర సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో గాంధీగ్లోబల్ ఫ్యామిలీ సభ్యులు యానాల ప్రభాకర్ రెడ్డి, గోనారెడ్డి, సార బాలయ్యగౌడ్, వినో బాభావే సేవా సమితి నాయకులు ఏలే భిక్షపతి, నోముల గణేశ్, కొయ్యడ నర్సింహ, గునిగంటి మల్లేశ్, కర్నాటి అంజమ్మ, వేశాల మురళి, కూరపాటి బాబు, ఇబ్రహీంపట్నం అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పైనే ధ్యాస..!

- అందుబాటులో ఉండని డాక్టర్లు
- ప్రైవేట్ క్లినిక్‌లలో విధులు
- అలంకారప్రాయంగా మారుతున్న పల్లె దవాఖానలు
- రోగులకు సరిగా అందని వైద్యసేవలు


తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లిలోని పల్లె దవాఖానా

భువనగిరి : సర్కారు వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. వైద్యులు సమయానికి అందుబాటులో ఉండకపోవడం, కొందరు డుమ్మాలు కొడుతూ ప్రైవేట్ క్లినిక్‌లలో పని చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వెరసి ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు పని చేయవల్సి ఉండగా కొన్ని చోట్ల మధ్యాహ్నం తర్వాత మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు.

సిబ్బందే డాక్టర్లు

పల్లె దవాఖానల్లో పని చేయాల్సిన వైద్యులు నిర్ణీత ధనార్జనే ధ్యేయంగా ప్రైవేట్ క్లినిక్‌లలో అధిక సమయం పని చేస్తున్నారు. తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లిలోని పల్లె దవాఖానకు చెందిన వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నారని గ్రామ ప్రజాప్రతినిధులు ఇటీవల అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని దవాఖానాల్లో రోజు విడిచి రోజు వస్తున్నారని, ఈ సమయంలో కింది స్థాయి సిబ్బంది రోగులను పరిశీలించి మందులు ఇస్తున్నారని తెలుస్తోంది. సాధారణంగా గ్రామంలో జన ఆరోగ్య కమిటీలు ఏర్పాటు చేసి ఆస్పత్రికి వచ్చిన నిధులు, నిర్వహణ, గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ప్రతి 3వ శనివారం చర్చించాలి. కానీ, ఇది ఎక్కడా అమలు కావడం లేదు. కొన్ని ఆస్పత్రులకు రోగులు తగిన సంఖ్యలో రాకపోతే రికార్డుల్లో తప్పుగా నమోదు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో లేని సమయంలో ఓపీకి సేవలందించేందుకు తాత్కాలికంగా పల్లె దవాఖానల్లోని డాక్టర్లను పంపుతున్నారు. కానీ, పల్లె దవాఖానాకు వచ్చిన రోగులను కిందిస్థాయి సిబ్బంది పరిశీలించి మందులు అందజేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అందుబాటులో ఉండాలి



పల్లె దవాఖానల్లోని వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. నిర్ణీత సమయం వరకు అందుబాటులో ఉండాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేయవల్సిన సమయంలో ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నట్లుగా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. తుర్కపల్లి మండలంలోని పల్లె దవాఖానల వైద్యులు కొందరు ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేస్తాం.
– డాక్టర్ పాపారావు, డీఎంహెచ్‌ఓ

పల్లె దవాఖానల్లో ఇలా..

జిల్లాలో మొత్తం 99 పల్లె దవాఖానలు ఉన్నాయి. ప్రతి పల్లె దవాఖానలో ఎంబీబీఎస్ లేదా బీఎస్సీ నర్సింగ్, ఆయుర్వేదిక్ అర్హత కలిగిన వైద్యులు ఎంఎల్‌హెచ్‌పీలుగా ఉంటారు. వీరితో పాటు ఇద్దరు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లతో పాటు ఆశ కార్యకర్తలు విధులు నిర్వహిస్తారు. ప్రస్తుతం జిల్లాలో రెండు,మూడు పల్లె దవాఖానలు తప్పా మిగతా అన్ని చోట్ల వైద్యులు ఉన్నారు. వీరు రోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు దవాఖానాలో అందుబాటులో ఉండాలి. దవాఖానాకు వచ్చే రోగుల వివరాలను రికార్డులో నమోదు చేసిన తర్వాత ఈ సంజీవని యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. రోగి సమస్యను బట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేయాల్సి ఉంటుంది. పల్లె దవాఖానల నిర్వహణ కోసం ఒక్కో ఆస్పత్రికి ఏటా రూ.60 లక్షల వరకు నిధులు వస్తుంటాయి. మెరుగైన వైద్యసేవలు అందించిన ఆస్పత్రులకు ఎక్కువ నిధులు మంజూరు అవుతుంటాయి.

ఆరెగూడెంలో పోలీసుల గస్తీ

మోటకొండూరు: మండలంలోని ఆరెగూడెంలో బుధవారం రాత్రి ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహించారు. గ్రామస్తులతో మాట్లాడారు. గొలుసు దొంగతనాలు పెరిగిపోతున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించవద్దని సూచించారు. ఇళ్లలో విలువైన వస్తువులను ఉంచుకోవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందజేయాలని పేర్కొన్నారు. దొంగలను పట్టించిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. గస్తీలో ఎస్‌ఐ తేజంరెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పేరబోయిన కార్తీక్, కొల్లూరి ఆంజనేయులు, సుధాకర్, భాను, మహేష్, నర్సింహ పాల్గొన్నారు.


గ్రామస్తులకు సూచనలు చేస్తున్న ఏసీపీ

ఎయిమ్స్‌లో హీమో డయాలసిస్ యూనిట్


హీమో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ వికాస్‌భాటియా, చిత్రంలో వైద్య సిబ్బంది

బీబీనగర్: డయాలసిస్ బాధితుల కోసం బీబీనగర్ ఎయిమ్స్‌లో ఏర్పాటు చేసిన హీమోడయాలసిస్ యూనిట్‌ను గురువారం సంస్థ డైరెక్టర్ వికాస్ భాటియా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీమో డయాలసిస్ యూనిట్ వల్ల మూత్రపిండ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. డయాలసిస్ సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట కేంద్రాలకు వెళ్తూ అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని గుర్తించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుపేదలు చాలా అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. ఇకనుంచి అటువంటి సమస్య ఉండదన్నారు. ఐదు ఐసీయూ బెడ్లతో హీమోడయాలసిస్ యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని డయాలసిస్ బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎయిమ్స్‌లో ఇప్పటికే అనేక రకాల అధునాతన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని, తద్వారా ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి రోగులు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ అభిషేక్ ఆరోరా, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ కల్యాణి, వైద్యులు సూర్య, ధనలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

'భువనగిరి' వ్యయ పరిశీలకుల నియామకం

సాక్షి యాదాద్రి: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికల వ్యవ పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. ఇబ్రహీంపట్నం, మునుగోడు, భువనగిరి అసెంబ్లీ సెగ్మెంట్లకు రాకేష్‌కుమార్ రంజన్, నకిరేకల్, ఆలేరు, జనగామ, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సాయన్‌దేబర్మ వ్యయ పరిశీలకులుగా వ్యవహరించనున్నారు.

'నల్లగొండ' పరిశీలకుడిగా కళ్యాణ్‌కుమార్ దాస్



కళ్యాణ్‌కుమార్ దాస్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడిగా కళ్యాణ్‌కుమార్ దాస్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. గురువారం నల్లగొండ పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కళ్యాణ్‌కుమార్ దాస్‌కు నల్లగొండ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కళ్యాణ్‌కుమార్‌దాస్ 81214 46758 ఈ ఫోన్ నంబర్‌లో అందుబాటులో ఉండనున్నారు.

నామినేషన్లు షురూ..



భువనగిరిటౌన్: భువనగిరి లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా గురువారం యాదాద్రి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బేతి నరేందర్



భువనగిరిటౌన్: భువనగిరి లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మర్రి స్వామి



నల్లగొండ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థిగా గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్



నల్లగొండ లోక్‌సభకు సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న రచ్చ సుభద్రారెడ్డి



నల్లగొండ లోక్‌సభకు ప్రజావాణి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న లింగిడి వెంకటేశ్వర్లు

ప్రజల చేతిలో అస్త్రం..

సీ–విజిల్



భువనగిరి కలెక్టరేట్‌లో సీ-విజిల్ యాప్‌పై అవగాహన పోస్టర్

- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేసేందుకు వీలుగా యాప్ రూపకల్పన
- ఫిర్యాదు అందిన 5 నిమిషాల్లోనే రంగంలోకి ఫ్లయింగ్ స్క్వాడ్
- 100 నిమిషాల్లో ఫిర్యాదుకు పరిష్కారం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

భువనగిరిటౌన్: ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేసేందుకు సీ-విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎవరైనా ఎన్నికల కోడ్‌ఉల్లంఘిస్తే ఫొటో, వీడియో, ఆడియో ఏదైనా రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వారా ఫిర్యాదు అందిన 5 నిమిషాల్లోనే ఈ సమాచారాన్ని సంబంధిత ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకు పంపుతారు. ఈ టీం 15 నిమిషాల్లో ఆ ప్రాంతానికి వెళ్లి 30 నిమిషాల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ఎన్నికల అధికారికి చేరవేస్తారు. ఈ నివేదికపై సంబంధిత ఎన్నికల అధికారులు 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. మొత్తం వంద నిమిషాల్లో సీ-విజిల్ యాప్‌లో అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటారు. అదేవిధంగా ఫిర్యాదు స్టేటస్ తెలుసుకునే వెసులుబాటు కూడా యాప్‌లో ఉంది. అలాగే వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే వ్యతిరేక కథనాలపై కూడా కంట్రోల్ రూం నుంచి చర్యలు తీసుకుంటారు.

రిజిస్టర్ చేసుకోండిలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో సీ-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నంబర్ ద్వారా యాప్‌లో రిజిస్టర్ చేసుకోగానే, ఫోన్‌కు ఓటీపీ నంబర్ వస్తుంది. దానిని నమోదు చేసిన వెంటనే సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించుకోవచ్చు.

ఎలాంటి ఫిర్యాదులు చేయవచ్చంటే..

ఎన్నికల్లో డబ్బు పంపకాలు, ఉచితంగా వస్తువులు, బహుమతులు ఇవ్వడం, రెచ్చగొట్టే ప్రసంగాలు, ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం వంటి ఉల్లంఘనలను ఫొటో, వీడియో, ఆడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేయవచ్చు.



భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం

ఎలా చేయాలంటే..

సెల్‌ఫోన్‌లో సీ-విజిల్ యాప్ ఓపెన్ చేయగానే స్క్రీన్‌పై ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో మీ వద్ద ఏ ఆధారం ఉంటే ఆ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఆధారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరిస్తే ఈ ఫిర్యాదు నేరుగా ఎన్నికల సంఘానికి చేరుతుంది. ఎస్‌ఈసీకి చేరిన ఈ ఫిర్యాదును అక్కడి అధికారులు వెంటనే సంబంధిత ఎంసీసీ కంట్రోల్ రూంకు చేరవేస్తారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు వెంటనే చర్యలకు ఉపక్రమిస్తారు



మీలో ఒకడిని..

ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్. - మిర్యాలగూడ



'గుర్తు'ంచుకోండి..

భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గురువారం రామన్నపేట మండల కేంద్రంతో పాటు వెల్లంకి తదితర గ్రామాల్లో కమలం పువ్వు గుర్తులతో ప్రచారం నిర్వహించారు. - రామన్నపేట

బీ-ఫాం అందుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నుంచి బీ-ఫాం అందుకుంటున్న నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి



కేసీఆర్ చేతులమీదుగా బీ-ఫాం అందుకుంటున్న భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

నల్లగొండ టూటౌన్: బీఆర్ఎస్ నల్లగొండ, భువనగిరి ఎంపీ అభ్యర్థులు కంచర్ల కృష్ణారెడ్డి, క్యామ మల్లేష్ గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ అధినేత కేసీఆర్ నుంచి బీ-ఫాం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, బీర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్. భాస్కరరావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22లోగా ఫారం-12 సమర్పించాలి

- నల్లగొండ కలెక్టర్ హరిచందన

నల్లగొండ : పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులు ఈ నెల 22లోగా ఫారం–12 సమర్పించాలని నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరిచందన పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం ఉంటుందన్నారు. 22వ తేదీ తర్వాత సమర్పించే ఫారాలు పరిగణనలోకి తీసుకోమని తెలిపారు. హోమ్ ఓటింగ్‌లో పాల్గొననున్న వృద్ధులు, వికలాంగులు కూడా ఈ నెల 22వ తేదీలోగా ఫారం–12డి సమర్పించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి, పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి శ్రీదేవి, జిల్లా ఎన్నికల శిక్షణ రిసోర్స్ పర్సన్ తరాల పరమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

ఈవీఎంల తరలింపు



ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న సూర్యాపేట కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్

సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మొదటి ర్యాండమైజేషన్ అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను తరలించినట్లు సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని గోదాములో ఈవీఎంల తరలింపు ప్రక్రియను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్ లతతో కలిసి కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా 25 శాతం రిజర్వ్‌డ్‌తో బ్యాలెట్ యూనిట్లు 1500, కంట్రోల్ యూనిట్లు 1500, 40 శాతం రిజర్వ్‌డ్‌తో 1,680 వీవీ ప్యాట్‌లను ఏఆర్‌ఓల ఆధ్వర్యంలో తరలించినట్లు వివరించారు. ఆయా నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లలో వాటిని భద్రపర్చి ఆ తర్వాత రెండో ర్యాండమైజేషన్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓలు , ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాసరాజు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా కట్టుదిట్టం చేశాం

- సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలో నిఘా కట్టుదిట్టం చేసినట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేస్తామని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రాజకీయ పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలు, ప్రజలు, పౌరులు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని సూచించారు.

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: పదేళ్ల పాటు రాష్ట్రంలో నియంత పాలన కొనసాగించి, లక్షల కోట్లు కాజేసిన కేసీఆర్ కుటుంబం అంతా జైలుకు వెళ్లడం ఖాయమని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గురువారం మునుగోడులో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి త్వరలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని, పార్లమెంట్ పరిధిలోని ఆ పార్టీ నేతలు అంతా కాంగ్రెస్ పార్టీ కండువాలు జేబులో పెట్టుకొని పార్టీలో చేర్చుకోమంటూ తమను బతిమిలాడుతున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసేందుకు నాయకులు ముందుకు రావడం లేదన్నారు. అది తెలియక కేసీఆర్ మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వాని కూల్చివేస్తాని ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. 10 ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్నారు. భునగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీజేపీకి ఓట్లు లేవని, అది తెలియక ఆ పార్టీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ తానే గెలుస్తానని గొప్పలు చెప్పుకుంటున్నాడన్నారు. ప్రతి కార్యకర్త సైకుడిలా పనిచేసి కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత ఆయన అడుగు జాడల్లో నడుస్తానన్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మల్‌రెడ్డి రాంగారెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్‌నాయక్, సంజీవ రెడ్డి, చెవిటి వెంకన్న, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, పున్న కైలాస్‌నేత, దొడ శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవి, ఏలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, తాడూరి వెంకట్ రెడ్డి, వెన్‌రెడ్డి రాజు, గుత్త ఉమ పాల్గొన్నారు.

రేవంత్ బూట్లు తుడిచేందుకు పోటీపడుతున్న కోమటిరెడ్డి బ్రదర్స్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



నల్లగొండలో మీడియాతో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: రేవంత్‌రెడ్డి వచ్చి తెలుగు కాంగ్రెస్‌గా మార్చిండని తీవ్రంగా ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి బద్రర్స్ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి బూట్లు తుడిచేందుకు పోటీ పడుతున్నారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం నల్లగొండకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పదవి పోకుండా ఉండేందుకు అన్న, మంత్రి పదవి కోసం తమ్ముడు పోటీపడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని సైతం తిట్టిన ఈ దుర్మార్గులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో రూ. 20 వేల కోట్లకు కాంగ్రెస్‌ను బీజేపీకి తాకట్టు పెట్టిన చరిత్ర వీరిదని పేర్కొన్నారు. అన్న వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉండి బీజేపీకి ఓటేయమన్నారని దుయ్యబట్టారు. నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడుతూ అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. చేతకాని దద్దమ్మలు, బ్యాంకులను మోసం చేసిన దొంగలు వీళ్లని ఆరోపించారు. మోదీని రాహుల్ వ్యతిరేకిస్తుంటే రేవంత్‌రెడ్డి బడేభాయ్ అంటున్నారని, ఎప్పటికైనా ఛోటేభాయ్ బడేభాయ్ దగ్గరికి వెళ్తాడని ఆపార్టీ వారే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. ఆస్తుల గురించి మాట్లాడుతున్న కోమటిరెడ్డి బ్రదర్స్ ఎవరి బతుకు ఏంటో అందరికీ తెలుసన్నారు. మీడియా మిత్రులు మా ఊరికి వెళ్లి మా మూలాలు, కోమటిరెడ్డి వాళ్ల ఊరికి వెళ్లి వాళ్ల మూలాలు, రెవెన్యూ రికార్డులు చూడవచ్చన్నారు. లక్ష రూపాయల కళ్లజోడు, లక్ష రూపాయల గడియారం పెట్టుకొని జూబ్లీహిల్స్ పబ్స్‌లో ఫోజులు కొడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్‌పై అవాకులు, చవాకులు మాట్లాడితే ప్రజలు బట్టలు ఊడదీసి కొడతారని హెచ్చరించారు. ఆయన వెంట నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకుల విద్యార్థినులకు అస్వస్థత



నేరేడుచర్ల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

నేరేడుచర్ల: మండలంలోని చిల్లేపల్లి గ్రామ పరిధిలో గల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న లావణ్య, సంజన, వసంతరాణి, ప్రణీత తెల్లవారుజామున వాంతులు చేసుకున్నారు. దీంతో పాఠశాల క్రాఫ్ట్ టీచర్(హాస్టల్ ఇన్‌చార్జి) భరణి వాంతులు తగ్గేందుకు విద్యార్థినులకు మందులు ఇచ్చింది. అయినప్పటికీ విద్యార్థినులకు వాంతులు తగ్గకపోవడంతో సాయంత్రం 4గంటలకు నేరేడుచర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే విధులు పూర్తిచేసుకొని వైద్యాధికారి నాగిని ఆస్పత్రి నుంచి వెళ్లిపోయింది. ఆస్పత్రి సిబ్బంది వాంతులు తగ్గేందుకు వైద్యాధికారిని సలహా మేరకు మందులు ఇచ్చారు. అయినా విద్యార్థినులు మరో రెండు సార్లు వాంతులు చేసుకున్నారు. కొద్దిసేపటి తరువాత ఆరోగ్యం కుదుటపడటంతో ఇద్దరు విద్యార్థినులను వారి తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లగా.. మరో ఇద్దరు విద్యార్థినులను హుజూర్‌నగర్‌లో ఉంటున్న వారి తల్లిదండ్రులకు అప్పగించేందుకు హాస్టల్ ఇన్‌చార్జి భరణి ఆటోలో తీసుకెళ్లారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణం గురించి హాస్టల్ ఇన్‌చార్జి భరణిని అడుగగా.. ఈ నలుగురు మాత్రమే వాంతులు చేసుకున్నారని, మిగిలిన విద్యార్థినులు ఆరోగ్యంగానే ఉన్నారని చెప్పారు.

సందినేని జనార్దన్‌రావుకు కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న జగదీష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టూటౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్‌రావుకు పార్టీ శ్రేణులు, బంధుమిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం నల్లగొండ పట్టణంలోని అమూల్యకాలనీలో గల సందినేని జనార్దన్‌రావు నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభం కాగా.. హైదరాబాద్ రోడ్డులోని ఐటీ హబ్ వెనుక ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు జనార్దన్‌రావు నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కటికం సత్తయ్యగౌడ్, చీర పంకజ్‌యాదవ్, కరీంపాష, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, వంగాల సహదేవరెడ్డి, మాలె శరణ్యారెడ్డి, చిట్ల వెంకటేశం, అభిమన్యు శ్రీనివాస్ ఉన్నారు.

జనార్దన్‌రావు మృతి తీరని లోటు..

సందినేని జనార్దన్‌రావు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జనార్దన్‌రావు నిబద్ధత కలిగిన వ్యక్తి అని, ప్రజలకు ఎంతో సేవ చేశాడని కొనియాడారు. రోడ్డు ప్రమాదంలో జనార్దన్‌రావు మృతి చెందడం బాధాకరమని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.